# ఒక చీమ కథ

అనగా అనగా ఒక రాజు. ఆ రాజుగారికి ఏడుగురు కొడుకులు. ఆ ఏడుగురు కొడుకులూ వేట్లోకెళ్ళి, ఏడు చేపలు తెచ్చి ఎండ వేశారు. అందులో ఒక చేప ఎండలేదు.

"చేపా! చేపా!! ఎందుకు ఎండలేదు?"

"గడ్డిదుబ్బు అడ్డం వచ్చింది!" అన్నది చేప.

"గడ్డిదుబ్బా! గడ్డిదుబ్బా!! ఎందుకు అడ్డం వచ్చావు?"

"ఆవు నన్ను మేయలేదు!" అన్నది గడ్డి దుబ్బు.

"ఆవూ! ఆవూ!! ఎందుకు మేయలేదు?"

"కాపరివాడు విడువ లేదు!" అన్నది ఆవు.

"కాపరివాడా! కాపరివాడా!! ఎందుకు విడువ లేదు?"

"అవ్వ బువ్వ పెట్టలేదు!" అన్నాడు కాపరివాడు.

"అవ్వా! అవ్వా!! ఎందుకు బువ్వ పెట్టలేదు?"

"చంటివాడు ఏడుస్తున్నాడు!" అన్నది అవ్వ.

"చంటివాడా! చంటివాడా!! ఎందుకేడుస్తున్నావు?"

"నన్ను చీమ కుట్టింది!" అన్నాడు చంటివాడు.

"చీమా! చీమా!! ఎందుకు కుట్టావు?"

"నేనెందుకు కుట్టానో నీకు తెలుసు. తెలిసి కూడా నువ్వు అమాయకత్వం నటిస్తున్నావని నాకు తెలుసు. అమాయకులంటే నాకు సానుభూతి ఉన్నమాట నిజమేగానీ, దాన్ని నటించేవారంటే మాత్రం నాకు పరమ అసహ్యం" అన్నది చీమ నన్ను గుచ్చి గుచ్చి చూస్తూ.

అది గుచ్చి గుచ్చి చూస్తున్నట్టు నేను గమనించాను. ఎందుకలా గుచ్చి గుచ్చి చూస్తున్నదో నేను కుశాలమీద గ్రహించాను.

నేను నిజంగానే అమాయకుణ్నో, లేకపోతే అమాయకత్వాన్ని నటిస్తున్నానో, చీమగారు ఖచ్చితంగా పోల్చుకోలేక పోయారన్నది తేలిపోయింది. ఏదో ఒక నిశ్చయానికొచ్చిన చూపు వేరు. ఎటూ తేల్చుకోలేని చూపు వేరు. చీమగారిది—ఈ చివరి రకానికి చెందిందని ఆ చూపును చూస్తూనే గ్రహించాను. ఎందుకయినా మంచిదనీ, అక్కడే ఇంకొంచెం నొక్కి చూద్దామనీ, అనిపించింది.

"చివరకి—ఇదా—నా గురించి నీ వనవలసింది! ఒక్క సంగతి గుర్తుంచుకో. నటించడం అసలేమీ చాతగానివాణ్ని కాదు గానీ నీ దగ్గర కూడా నటించాలా—అని! ఆ అవసరం ఉన్నదని ఇప్పటి దాకా నే ననుకోలేదు. ఇప్పుడూ అనుకోవడం లేదు. నా బిడ్డల సాక్షిగా చెబుతున్నాను. నువ్వా చంటి వెధవను ఎందుకు కొట్టిందీ నాకు తెలియదు" అన్నాను.

నా వాక్యం ముగిసీ ముగియకముందే చీమ ఫకాలుమని నవ్వింది!

"అంటే - నా మాటమీద నీకు నమ్మకం లేదన్నమాట!" అన్నాను.

"అలా నిగ్గదీయవాకు. 'లేదు' అన్న వొక్క మాట నే నన్న తరవాత, నువ్వు పిసుక్కు చస్తావు. నిన్ను - నూటికి నూరుపాళ్ళు నేను నమ్మలేకపోతున్నాను. అసలేమీ నమ్మకుండానూ ఉండలేక పోతున్నాను. కాస్త నిజాన్ని, ఇంకాస్త అబద్ధాన్ని కలగలిపి నా ముందుంచావని నే ననుకొంటున్నాను" అన్నది చీమ.

"నా బిడ్డలమీద ఒట్టేసుకొన్నా నమ్మవా?" అన్నాను.

ఈ సారి చీమ, నన్ను ఎగాదిగా చూసింది. ఒక్క క్షణం - ఆలోచిస్తున్నదానిలా అటూ ఇటూ తిరిగింది. తల గోక్కున్నది. ఒళ్ళు విరుచుకొన్నది. సన్నగా నిట్టూర్చింది.

"నువ్వు నిజాయితీగా బతకడం ఎంత అవసరమో, అలా బతుకుతున్నట్టు నలుగురికీ తెలియడమూ, తెలిసేలాగా బతకడమూ అంతే అవసరం! ఇదొక జీవిత సూత్రం. ఈ సూత్రం నీకు తెలిసినట్టు కనబడదు. ఒకవేళ తెలిసినా, బుద్ధి పూర్వకంగానే దాన్ని నీవు పట్టించుకోవడం లేదేమో నాకు తెలియదు... నువ్వు అమాయకత్వాన్ని నటిస్తున్నావనే అనుకొన్నాను. మళ్ళీ అలాంటివాడివి కాదని, లోపల పీకుతూనే ఉంది. అంచాత - ఎటూ తేల్చుకోలేని దశలో పడిపోయాను. ఎదుటి వారు నిన్నపార్థం చేసుకొనేలాగా ఎప్పుడూ ప్రవర్తించమాకు..." అని హితబోధ చేసింది చీమ.

ఆ కత్యానికి, నా మాడు పెంకు టాంగుమని లేచిపోయినంత పనయింది. చీమగారికి సాష్టాంగ నమస్కారం చేశాను.

"నువ్వు నటిస్తున్నావని నే ననుమానించడానికి, నా కారణాలు నా కున్నాయి. నువ్వెంత సేపటికీ, 'చంటి వెధవను ఎందుకు కట్టావ్?' అని నిగ్గదీస్తున్నావే తప్ప, ఇంకో సందేహాన్ని అడగడమే లేదు" అన్నది చీమ.

"ఇంకో సందేహం నాకు రాను కూడా రాలేదే! అన్నిటికీ అన్నీ సరిపోయాయే" అన్నాను.

"ఇలా అంటున్నప్పుడే, నీవు నటిస్తున్నావన్న అనుమానం ఎదుటివారికి కలుగుతుంది... నిజంగా నీకు సందేహాలు రాకపోవచ్చుగానీ - ఆలోచిస్తే ఈ కథలో నీకు చాలా లొసుగులు కనబడతాయి మాటవరసకు చెబుతాను చూడు. రాజుగారికి ఏడుగురు కొడుకులు గదా! ఆ ఏడుగురున్నూ ఒకేసారి వేటి కెళ్ళాలా? వెళ్ళి - ఏడంటే ఏడే చేపలు తీసుకురావాలా? అసలూ - రాజుగారి కొడుకులేమిటి, వేటి కెళ్ళి వారే చేపలు పట్టుకోవడమేమిటి? నీకు అసంబద్ధంగా కనిపించడంలేదా? రాజులైన వాళ్ళు, ఇంకోరి శ్రమను అనుభవిస్తారేం తప్ప, సొంతంగా శ్రమపడరు. శ్రమపడడం మరొకరి పనయినట్టూ

అనుభవించడమే తమ పని అయినట్టూ వారనుకొంటారు. నీ కిక్కడే అనుమానం రావాలి గదా! ఎందుకు రాలేదు?" అన్నది చీమ.

ఇల్లాగా—చీమగారు దబాయిస్తుంటే, నా నోటంట మాట రాలేదు. నిజమే! చీమగారన్నట్టు రాజుగారి కొడుకులకు చేపలు పట్టుకొనవలసిన అవసర మేముంది? నా మట్టి బుర్రకు ఆపాటి అనుమానం తట్టనందుకు నన్ను నేనే తిట్టుకొన్నాను. కాని—నా తెలివి తక్కువతనాన్ని చీమ ముందు ఒప్పుకోవడానికి నా అహంకారం అడ్డం వచ్చింది!

"నా కొచ్చిన అనుమానాలకు సమాధానం చెప్పమని మాత్రమే నిన్నడిగాను. తెలిస్తే చెప్పు. తెలియకపోతే 'నావల్ల కాదు, అను. అంతే గానీ, నాకు రాని సందేహాల పట్టిక నొకదాన్ని తయారుచేసి, అవన్నీ ఎందుకడగలేదని దబాయించవాకు. నీకు సందేహంగా తోచింది, నా కంటికి సందేహంగా కనబడలేదు అయినప్పుడు నే నెందుకడగాలో చెప్పు?" అన్నాను.

నేనీ ప్రశ్న అడుగుతానని చీమ ఊహించి ఉండదు. అది బిత్తరపోయింది ఆశ్చర్యంగా నావేపు చూసింది!

"రాజుగారి కొడుకులయి ఉండి కూడా స్వయంగా చేపలు పట్టుకోవడానికి వెళ్లడంలో నీకు సందేహమే రాలేదా? నువ్వేదో మొండికెత్తి వాదిస్తున్నావు గానీ — నిజం మాట్లాడడం లేదు" అన్నది చీమ.

"నిజంగానే నాకు సందేహం రాలేదు...ఎందుకో చెబుతున్నానుండు...నా మాట పూర్తిగా విను. అతను రాజుగారే గానీ, అతనికి రాజ్యమున్నట్టూ, ఆ రాజ్యాన్ని పరిపాలిస్తున్నట్టూ కథలో ఎక్కడా లేదు. 'రాజు' అన్నది అతని పేరు కాకూడదా? ఆ పేరున్న ప్రతివాడూ పరిపాలకుడే అయితీరాలని ఎక్కడా లేదే! మాటవరసకు—అతని పేరు 'సత్తిరాజు' అనుకొందాం అతగాడికి

ఏడుగురు కొడుకు లున్నారనుకొందాం. ఆ సత్తిరాజు గారి వృత్తి చేపలు పట్టుకోవడమే ననుకొందాం. నేను మాత్రం కలాగనే అనుకొన్నాను. అయినప్పుడు నాకు సందేహం రావలసిన అవసర మెక్కడుంది?" అన్నాను.

ఈ సారి చీమ తెల్లబోయింది!

"నిజమే! ఈ కథలో - అతగాడు పరిపాలకుడన్న వాక్యం ఎక్కడా లేదు" అని ఒప్పుకొంది చీమ.

ఇక — చీమగారి నోరు మూయించడం నాకు క్షణాలమీద పని!

"నువ్వు — మధ్యకాలపు రాజుల్ని దృష్టితో ఉంచుకొని మాట్లాడి ఉంటావు. ఆ రాజులు పాలకులు. పాలించడానికి తాము అవతరించామని వారు గట్టిగా నమ్మినవారు. పని చేయడం ప్రజలు వంతూ, ఆ పని ఫలితాన్ని అనుభవించడం తమ వంతూ - గా, వారు బతికారు. ఆదిమ సమాజంలోనూ పాలకులున్నారు. ఆ పాలకులను ప్రజలు ఎన్నుకొనేవారు. మిగిలిన ప్రజలందరితో బాటుగా, ఆనాటి పాలకులు కూడా, పని చేసి పొట్ట పోసుకునేవారు. ప్రజలకన్నా తాము అధికులనన్న ఆలోచన వారి కెన్నడూ రాలేదు. అందరితో బాటు పనిపాట్లు చేసుకుంటూనే, అదనంగా అందరి సంక్షేమం కోసమూ, పాటుపడే వారు. ఒక సారి 'రాజు' అయినవాడు, మరో సారి కూడా 'రాజు' అవుతాడన్నదేమీ లేదు. ఏడుగురు కొడుకుల్ని కన్న మన రాజు గారు కూడా ఇలా ఎన్నుకోబడిన రాజుగారే కావచ్చు. కాబట్టి ఆయన కొడుకులు చేపలు పట్టుకోవడంలో నాకెలాంటి అనుమానమూ రాలేదు" అన్నాను చీమతో.

"మంచిదే! మరి నీ కొచ్చిన అనుమాన మెక్కడ?" అన్నది చీమ.

"చంటి వెధవను కుట్టడం దగ్గర. పశువుల కాపరికి, అవ్వ బువ్వ పెట్టకపోవడానికి కారణం చంటివాడు ఏడవడం. చంటివాడూ

పడవడానికి కారణం, వాణ్ణి నీవు కట్టడం. నువ్వెందుకు వాణ్ణి కట్టింది నాక్కావాలి?" అన్నాను

"అది కథలోనే ఉంది గదా! వాడు నా బంగారు కన్నంలో వేలు పెట్టాడు మరి నేను కట్టనా?" అన్నది చీమ నా వేపు ఆశ్చర్యంగా చూస్తూ.

సరిగ్గా నాక్కావలసిన ముక్కనే చీమగారు కూడా అన్నందుకు లోలోపల ఆనందించాను.

"అసలు నా సందేహమే ఇక్కడా!" అని ప్రారంభించాను. "నువ్వెంతో, నీ బిసాదెంతో నాకు తెలుసు. రాత్రింబవళ్ళు శరీరం హూనం చేసుకొన్నా పొట్ట నిండనివాళ్ళు, మానవ సమాజంలో చాలా మంది ఉన్నారు. మాలో కొంత మంది కోటాను కోట్ల సంపదలను పాతేసుకొన్నమాట నిజం! ఆ సంపదను కాపాడుకోవడం కోసమూ, దాన్ని పెట్టుబడిగా పెట్టి, ఇంకా ఇంకా కోట్లు సంపాదించడం కోసమూ, మా వాళ్ళు అడ్డమైన పనులూ చేస్తున్నమాట కూడా నిజం! తమ సంపదలు పెరగడానికీ, పెరిగిన సంపదలు భద్రంగా ఉండడానికీ మాలో కొంత మంది దేశాలకు దేశాలను యుద్ధాల్లో ముంచెత్తుతున్నారు. ఆయుధాలకోసం తమ రాబడుల్లో 80 వంతులు ఖర్చు చేస్తున్నవారు కూడా ఉన్నారు. అదే సమయాన తిండిలేకా, తాగడానికి నీళ్ళులేకా, ఉండడాని కింత నీడ లేకా, పురుగులకన్నా హీనాతి హీనంగా బతుకుతున్న మనుషులు ప్రపంచం మొత్తంమీద అధిక సంఖ్యలో ఉన్నారు మన దేశంలోనే ముష్టిబతుక్కన్నా హీనంగా బతుకుతున్నవారు నూరింట 52 వంతుల మంది ఉన్నారు ఇంకొన్ని దేశాల్లోనయితే 10, 15 కుటుంబాలకు తప్ప, మిగిలిన వారికి ఒంటిపూట గంజి కూడా దొరకడం లేదంటున్నారు, ఈ దరిద్రులందరూ సోమరు లనుకోకు. రోజుకు 18 గంటలు పని చేసినా, వారికి బువ్వ దొరకడంలేదు. కానీ—వారి పాలకులు మాత్రం సమస్త భోగాలూ అనుభవిస్తున్నారు. పైగా — వారు కష్టపడు

తున్నది కూడా ఏమీ లేదు. సంపదను ఉత్పత్తి చేయడంలో పాలు పంచుకోనని వారివద్ద సంపద పోగుపడుతున్నది. సంపదను సృష్టిస్తున్న వారికేమో - తిండి లేదు. ఇది - చాలా సమాజాల్లో నడుస్తున్న విధానం! ఇప్పుడు అసలు విషయాని కొస్తున్నాను. నీవేమో 'నాది బంగారు కన్నం' అంటున్నావు. నిజంగా, నీతిగా, ధర్మ బద్ధంగా, నీవు శ్రమపడితే, నీది 'బంగారు కన్నం' కావడానికి వీల్లేదు. నీది బంగారు కన్నం కావడమే నిజమయితే, అక్రమార్జనకు, నీవూ పాల్పడ్డావన్నమాటే! ఆ సంగతేదో నేరుగా నీ నించే తెలుసుకొందామనే నిన్నా ప్రశ్న అడిగాను. ఇహ చెప్పు" అన్నాను.

చీమగారు చిద్విలాసంగా నవ్వారు.

"పిచ్చి నాయనా! ఈ ప్రశ్న అడగడానికి ఇన్ని డొంకతిరుగుళ్ళెందుకయ్యా?" అన్నది చీమ అని, మెల్లిగా గొంతు సవరించుకొన్నది. "మీ రెలా బతుకుతున్నది నేను చూస్తూనే ఉన్నాను. మీ చుట్టూ ఉన్నవారు తిండిలేక మలమలా మాడి చస్తుంటే, మీరు విందులు చేసుకుంటారు. మీ చుట్టూ ఉన్నవారు జానెడు గుడ్డలతో మానం దాచుకోలేక సిగ్గుపడుతుంటే, మీ గోదాములనిండా, కొనే దిక్కులేక గుడ్డల తానులు మగ్గిపోతుంటాయి. నీ వన్నట్టు మీలో నూరింట 80, 90 వంతుల మంది పశువులకన్నా హీనంగా బతుకుతుంటే, మీరు సిగ్గు పడడం కూడా మరిచిపోయారు. మీ అంత నీచ ప్రాణుల్ని నే నెక్కడా చూడలేదు. మీ ఆశకు అంతు లేదు. మీ బ్రతుక్కి తృప్తి లేదు. మొత్తం విశ్వాన్ని తెచ్చి, మీముందుంచినా, మీరింకా ఇంకా ఇంకా కోరుకొంటూనే ఉంటారు. ఆ కోరికలను తీర్చుకోవడం కోసం, మిమ్మల్ని మీరే దోచుకుంటారు. మిమ్మల్ని మీరే పీడించుకొంటారు. మిమ్మల్ని మీరే మోసం చేసుకొంటారు. మిమ్మల్ని మీరే దగా చేసుకొంటారు. మీ మీద మీరే యుద్ధం చేసుకొంటారు. చేసుకొని, మీ చేతుల్లో మీరే నాశనమవుతారు. అలా నాశనం కావడానికయినా మీ రొప్పుకుంటారు గానీ, మరొకరి

సొత్తుకు ఆశపడకుండా మాత్రం బతకలేరు. మీది కానిదాని కోసం, అల్లల్లాడి పోవడమన్నది మీ జీవలక్షణమయి పోయింది. కాకపోతే— వేలెడు లేని చంటి వెధవ నా బంగారు కన్నంలో వేలు పెట్టడ మేందుకయ్యా?" అన్నది చీమ.

"ఇన్నిటికీ నీది 'బంగారు కన్నం' ఎలా అయిందో చెప్పనే లేదు" అన్నాను ఇంకేమనడానికీ తోచక.

"ఎందుకాకూడదు? అది నా స్వార్జితం. నేను కష్టపడి సంపాదించుకొన్నాను. నా శ్రమ ఫలితం నాకు బంగారమే! మీరైతే— మరొకరి శ్రమ ఫలితాన్ని బంగారంగా మార్చుకొంటూరు - మనుషులు గనుక! నేను చీమను గదా! నా శ్రమ ఫలితాన్ని నేనే బంగారంగా మార్చుకొన్నాను. అదెలాంటిది కానివ్వు—నా శ్రమ నాకు బంగారమే! దాన్ని దోచుకోవడానికి ఎవరొచ్చినా సరే - నేను తిరగబడతాను. ఆ తిరుగుబాటులో నేను చావడానికయినా సిద్ధపడతాను గానీ, నా శ్రమను మరొకరు దోచుకోవడానికి వొప్పుకోనుగాక వొప్పుకోను. నాకన్న బలవంతులైనవారు, నన్ను క్షణంలో నలిపి పారేస్తారని నాకు తెలుసు బానిసగా బతకడంకన్నా, స్వేచ్ఛకోసం ప్రయత్నించి చావడంలోనే తృప్తి ఉన్నదని నేననుకొంటున్నాను. మీలో చాలామందికి ఈ కనీస జ్ఞానం కూడా ఉన్నట్టు కనిపించదు. నే నా కుర్రాణ్ణి ఎందుకు కుట్టానో, నీ కిప్పటికైనా తెలిసి ఉండాలి. నా కతనిమీద కోపంలేదు. ద్వేషంలేదు. నా శ్రమను కాపాడుకోవడానికి నేను చేసిన ప్రయత్నమది! మీ వాళ్ళను కూడా ఇలానే చేయమని చెప్పండి!" అన్నది చీమ కలుగులోకి పోతూ.

ఇది మామూలు చీమ కాదు. ఈపాటి 'సామాజిక చైతన్యం' ఉన్న చీమను నే నింతకు ముందెప్పుడూ చూడలేదు. ఇలాంటి చీమలు బతికి బట్టకడితే, ఏం - జరిగేదీ మీకు తెలుసు. ఈ దఫా మీకెక్కడన్నా, ఆ చీమ కనబడితే, నిస్సంకోచంగా నలిపి పారేయండి!

—:o:—